# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు విజయనగరం జిల్లాలోని గుర్ల గ్రామంలో పర్యటిస్తారు.**
2. **సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
3. **రాణి అహల్యాబాయి జీవితం అందరికీ ఆదర్శమని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు.**
4. **తెలంగాణలో గ్రూప్-1 పరీక్షలు ఈ రోజు ప్రారంభమవుతున్నాయి.**
5. **పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఈరోజు నిర్వహించుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో అతిసారంతో 8 మంది మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న పరిస్థితిని, బాధితులకు అందుతున్న వైద్య సాయంపై ఆరా తీశారు. వైద్యశాఖ అధికారులతో మాట్లాడారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, సురక్షిత తాగునీరు అందజేస్తున్నామని జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని, అతిసార వ్యాధి తగ్గేంతవరకు వైద్య శిబిరాలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. మరణాలకు గల కారణాలతోపాటు ఆయా ప్రభుత్వ శాఖల పరంగా ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు చేయాలని సూచించారు.

మరోవైపు ఈ రోజు ఉపముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ విజయనగరం జిల్లాలోని గుర్ల గ్రామంలో పర్యటిస్తారు. గ్రామంలోని పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరాలను పరిశీలించనున్నారు.

--------------------------

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా సంగంజాగర్లమూడిలో నిర్వహించిన 'పల్లెపండుగ' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో 1.40 కోట్ల రేషన్ కార్డుదారులు ఉన్నారని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్

సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ పథకానికి ఏడాదికి రూ.3వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. తదుపరి మంత్రివర్గ సమావేశంలో ఈ పథకానికి అనుమతి తీసుకుంటామని మంత్రి వివరిస్తూ...

వాయిస్ ..32 సెకన్లు

---

రాణి అహల్యాబాయి జీవితం అందరికీ ఆదర్శమని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమన్వయం సంస్థ ఆధ్వర్యంలో జరిగిన "తరతరాలకు స్ఫూర్తి రాణి అహిల్యాబాయి" పుస్తకావిష్కరణ సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, అహల్యాబాయి పాలనలో ప్రజల శ్రేయస్సు, సంక్షేమం, ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలుగులో ఆమె జీవిత చరిత్ర అందుబాటులోకి రావడం హర్షణీయమని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..33 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని ఏటికొప్పాక బొమ్మల తయారీకి ముడి సరకు అయిన అంకుడు కర్ర, కొండపల్లి బొమ్మలకు అవసరమయ్యే తెల్ల పొణికి చెట్లను విస్తారంగా పెంచాలని ఉప ముఖమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. బొమ్మల తయారీదారులు కర్ర లభ్యత సమస్యను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా కళాకారులకు అందుబాటులో ఉండేలా అంకుడు, తెల్ల పొణికి చెట్లు పెంచడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు సూచించారు.

ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా అంకుడు, తెల్ల పొణికి చెట్లు పెంచాలని, ఏటికొప్పాక, కొండపల్లి పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ, అటవీ, సామాజిక స్థలాల్లో వీటి పెంపకంపై దృష్టి సారించాలన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం అతిథులను సత్కరించే సందర్భంలో కళాకారులు తీర్చిదిద్దిన కళాకృతులను వారికి బహుమతులుగా అందజేస్తోంది.

---

కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ గత రాత్రి ఢిల్లీలో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల గురించి కేంద్ర హోంమంత్రికి వివరించినట్లు మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అపరిష్కృత ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వీలైనంత ఎక్కువ సాయం అందించాలని కోరామని తెలిపారు.

---

వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్-ఐఎస్‌బీలో నిర్వహించిన నాయకత్వ సదస్సులో నిన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గొప్ప నాయకులు కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని చెప్పారు. ఐఎస్‌బీలో ఉన్న వారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు అని తెలిపారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్–1 పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈనెల 27 వ తేది వరకు జరగనున్న ఈ పరీక్షలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 31 వేల 383 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించనున్నామని, మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాల తర్వాత పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి అనుమతి ఉండదని తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సదుపాయం కూడా ఉంటుందని, అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఈరోజు నిర్వహించుకుంటున్నాం. 1959లో చైనా సరిహద్దులో విధి నిర్వహణలో ఉన్న భద్రతాదళాల సిబ్బంది దేశరక్షణ కోసం చేసిన ప్రాణ త్యాగాలను ఈ సందర్భంగా దేశం స్మరించుకుంటూ వారికి నివాళులర్పిస్తోంది. దీంతోపాటు, గత ఏడాది కాలంలో విధి నిర్వహణలో అమరులైన భద్రతా దళాల సిబ్బంది, పోలీస్ సిబ్బందిని కూడా ఈరోజు స్మరించుకుంటున్నారు. కాగా.. ఈరోజు ఉభయ తెలుగురాష్ట్రాల్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్నాయి.

---------------------------

యువత సమగ్రాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వారి అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా ఒక రాష్ట్రానికి చెందిన యువతను మరో రాష్ట్రంలో పర్యటించేలా సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గుంటూరు జిల్లాలో ఈరోజు నుండి జరగనున్న "వతన్ కో జానో" కార్యక్రమం గురించి మరిన్ని వివరాలను మా ఆకాశవాణి గుంటూరు జిల్లా ప్రతినిధి రవిశంకర్ అందజేస్తారు.

..వాయిస్.. 40 సెకన్లు

---------------------------

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 430 కోట్లతో చర్లపల్లి, 715 కోట్లతో సికింద్రాబాద్, 429 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌లలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రైళ్లను పొడిగించామని దానికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో కృష్ణా నదికి వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి కూడా వరద ప్రవాహం పెరగడంతో 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి శ్రీశైలానికి 2.17 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, స్పిల్‌వే ద్వారా 1.67 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మరోవైపు విజయవాడ ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తిమొత్తం 1.18 లక్షల క్యూసెక్కుల నీటిని

దిగువకు విడుదల చేస్తున్నారు. ఈక్రమంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు తెలుగు దేశం పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉభయ గోదావరి జిల్లాలకు పేరాబత్తుల రాజశేఖర్‌ను ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు.

========================